క్లుప్తంగా

రేపటి నుంచి వసంత నవరాత్ర మహోత్సవాలు



పందలపాకలో కొలువైన కోదండ రాముడు

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని రెడ్ల రామాలయంలో ఆదివారం నుంచి వసంత నవరాత్ర మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉగాది నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకూ తొమ్మిది రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఉంటాయన్నారు.

మహిళలకు వార్షిక ప్రణాళికపై శిక్షణ

సీతానగరం: స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం స్వయం సంఘాల సభ్యులకు ఆర్థిక జీవనోపాధికి వార్షిక ప్రణాళికపై ఏపీఎం జిలానీ శిక్షణ నిర్వహించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి జీవనోపాదుల బలోపేతానికి రుణాలు మంజూరు కోసం మండల సమాఖ్య అధ్యక్షురాలు కందికట్ల అరుణ కుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఏపీఎం జిలానీ మాట్లాడుతూ మండల స్థాయిలో 236 మంది ఎన్యుమరేటర్లను ఎంపిక చేసి, ప్రతి ఎన్యుమరేటర్‌కు ఐదు నుంచి ఆరు సంఘాలను ట్యాగ్ చేసి, ప్రతి సంఘం లైవ్ మీటింగ్‌లు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సభ్యురాలి జీవనోపాధి కోసం భవిష్యత్తులో అవసరమయ్యే రుణాలను సైతం ఈ సర్వేలో ఎన్యుమరేటర్లు డేటా ఎంట్రీ చేయాలన్నారు. ఈ శిక్షణ ఆరు రోజుల పాటు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు హరిబాబు, దారా లక్ష్మి, ఎం.వెంకటలక్ష్మి, అక్కౌంటెంట్ జయరాజ్, వీవోఏలు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షకు 571 మంది హాజరు

బిక్కవోలు: పదో తరగతి పరీక్షలలో భాగంగా శుక్రవారం ఎస్ఎస్ పరీక్ష నిర్వహించారు. మండలంలోని బిక్కవోలు, బలభద్రపురం, పందలపాక కేంద్రాల ద్వారా 578 మంది విద్యార్థులకు 571 మంది హాజరైనట్టు ఎంఈవో – 1 సీహెచ్ సత్యనారాయణ తెలిపారు.

దివ్యాంగ చిన్నారులకు వితరణ



చిన్నారులకు వస్తువులను పంపిణీ చేస్తున్న దాతలు

పెదపూడి: అనపర్తిలోని భవిత సెంటర్‌లో దివ్యాంగుల పిల్లలకు ప్రొటీన్ పౌడర్, పాలు, పెరుగు ప్యాకెట్లు, బ్రెడ్, రస్కులు, బిస్కెట్లు తదితర వాటిని శుక్రవారం పంపిణీ చేశారు. మట్టి బొమ్మలు అమ్ముకునే నిరుపేద కుటుంబానికి 20 కేజీల గోధుమపిండి, నిత్యావసరాలను అందించారు. అనపర్తిలోని రైజింగ్ హ్యాండ్స్ ఫర్ హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక చిన్నం వీరరాఘవరెడ్డి సత్యవేణి దంపతులు కుమార్తె సహస్ర పుట్టిన రోజు సందర్భంగా వీటిని పంపిణీ చేశారు.

7 నుంచి ఇంటర్ అడ్మిషన్లు



హేమ, ప్రిన్సిపాల్

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏప్రిల్ 7 నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ బి.హేమ తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు తెలుగు, ఇంగ్లిష మీడియంలో అందుబాటులో ఉన్నాయన్నారు. అదే విధంగా ఇంటర్మీడియట్ విద్యా డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఏప్రిల్ ఒకటి నుంచి కళాశాల పునఃప్రారంభం అవుతుందని ఆ రోజు నుంచే తరగతులు ప్రారంభిస్తామన్నారు.

సారాకు బానిసలు కావొద్దు

రాజానగరం: సారాకు ఎవ్వరూ బానిసలు కావొద్దని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం రాజానగరంలో నవోదయం 2.0 పేరుతో ప్లకార్డులు చేతపట్టుకుని ర్యాలీ చేశారు. సారా వద్దు.. ఆరోగ్యమే ముద్దు అంటూ నినాదాలు చేశారు. సారా తయారు చేసినా, విక్రయించినా నేరమే అవుతుందని, అటువంటి వారిపై పీడీ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఝాన్సీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల పర్యటన

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే పర్యవేక్షణలో శుక్రవారం పర్యటన చేశారు. కడియం నర్సరీ, ద్రాక్షారామ ఆలయం, కాకినాడ పోర్ట్, కోరంగి ఫారెస్ట్, యానా వంటి ప్రదేశాలను సందర్శించారు. దీని ద్వారా చారిత్రక, సాంస్కృతిక, భౌగోళిక, పర్యావరణ అంశాలపై అవగాహన పొందారు. పురావస్తు కళాఖండాలు, ద్రావిడ ఆలయ శిల్పశైలి, ఫ్రెంచ్ వలస ప్రభావం, జీవవైవిధ్యం రక్షణ, కాకినాడ ఓడరేవు ప్రాముఖ్యతపై అధ్యయనం చేశారు.

మహిళల ఉపాధికి శిక్షణ

- కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం
- మొదలైన కార్యాచరణ



కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు

రాజానగరం: ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలలో మహిళలకే పెద్దపీట వేస్తున్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో మహిళలే లబ్ధిదారులుగా ఆయా పథకాలను అందజేస్తున్నారు. డీఆర్‌డీఏ, మెప్మా ఆధ్వర్యంలో స్త్రీ నిధి, సీఐఎస్ రుణాలు మంజూరు చేసి, స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తున్నారు. అలాగే ఎంఎస్ఎంఈతోపాటు 50 శాతం రాయితీపై రుణాలను సమకూరుస్తున్నారు. అంతే కాకుండా స్వయం ఉపాధిలో కూడా వారికే ప్రాధాన్యతనిస్తూ, ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధిని సాధించే దిశగా కార్యాచరణను రూపొందించి, అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మండలాలలో పేదింటి మహిళలకు కుట్టు పనిలో అవసరమైన శిక్షణను ఉచితంగా అందించడమే కాకుండా శిక్షణానంతరం కుట్టు మెషీన్లను కూడా ఉచితంగా అందజేసే ప్రయత్నం చేస్తున్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా గ్రామ/వార్డు సచివాలయాలలో పేర్లు నమోదు చేసుకున్న వారిని లబ్ధిదారులను ఎంపిక చేసి, మండల/మున్సిపల్ కేంద్రాలలో 45 నుంచి 90 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. బడుగు, బలహీన వర్గాలకు (బీసీ) చెందిన వారితో పాటు ఆర్థికంగా వెనుక బడిన అగ్ర వర్ణాలలోని పేదలకు ఈబీసీ కోటాలో కాపు, కమ్మ, రెడ్డి, క్షత్రియ, బ్రాహ్మణ మున్నగు వర్గాలకు చెందిన మహిళలకు కూడా అవకాశం కల్పిస్తున్నారు. ఒక్కో కేంద్రంలో సుమారు 50 మందిని ఎంపిక చేసి, అవసరాన్ని బట్టి బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇస్తున్నారు.

మగ్గం వర్కులో ఉచిత శిక్షణ

ప్రభుత్వ పరంగా కుట్టు శిక్షణ ఇస్తుంటే దివాన్ చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ద్వారా పేదింటి మహిళలకు మగ్గం వర్కులో ఉచిత శిక్షణ ఇచ్చి, అనంతరం ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నారు. దశాబ్దకాలంగా ఇస్తున్న ఈ శిక్షణా కార్యక్రమం మండల కేంద్రాలకే పరిమితం కాకుండా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అనేక మారుమూల గ్రామాలకు విస్తరించింది. వేలాది మంది మహిళలు మగ్గం వర్కులో శిక్షణ పొంది, స్వయం ఉపాధిని కూడా అందుకుంటున్నారు.

శిక్షణ ప్రారంభం

డీఆర్‌డీఏ ద్వారా ఇచ్చే కుట్టు శిక్షణకు జిల్లాలో ఎంపికలు నిర్వహించి, శిక్షణను ప్రారంభించారు. ఈ విధంగా ఎంపికైన మహిళల వివరాలు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఇలా ఉన్నాయి.

నియోజకవర్గం	బీసీలు	ఈబీసీలు
అనపర్తి	199	296
రాజమహేంద్రవరం సిటీ	202	291
రాజమహేంద్రవరం రూరల్	198	298
రాజానగరం	199	296
నిడదవోలు	196	300
కొవ్వూరు	196	300
గోపాలపురం	199	296
గోకవరం మండలం	67	60

జీవనోపాధి

చేతి పనులలో శిక్షణ పొందడం వలన స్వయం ఉపాధితో జీవనోపాధిని పొందవచ్చు. ఇప్పటికే మగ్గం వర్కులో పొందిన శిక్షణ బాగా ఉపయోగపడుతుంది. కుట్టుపనిలో కూడా శిక్షణలో పొందడం వలన బహుళ ప్రయోజనాలు ఉంటాయి. ఇంటికే పరిమితమైన మహిళలకు ఇటువంటి శిక్షణలు మనోస్థైర్యాన్ని అందిస్తాయి.

– ఓదూరి విజయలక్ష్మి, మల్లంపూడి

మగ్గం వర్కుతో ఆదాయం

దివాన్ చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ద్వారా మగ్గం వర్కులో శిక్షణ పొందాను. ప్రస్తుతం ఈ వర్కు ద్వారా మంచి ఆదాయం లభిస్తుంది. మగవారి సంపాదనపైనే ఆధారపడే కుటుంబాలకు ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు వేడినీళ్లకు చన్నీళ్లుగా తోడ్పడతాయి.

– సంగీత భవాని, పుణ్యక్షేత్రం

దరఖాస్తు చేసుకోండి

ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలు కుట్టుశిక్షణ పొందాలనుకుంటే సమీపంలోని గ్రామ సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. 18 నుంచి 50 ఏళ్ల వయస్సున్నవారు ఇందుకు అర్హులు. రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు తీసుకుని గ్రామ సచివాలయాలని వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చు.

– జేపీ ఝాన్సీ, ఎంపీడీఓ, రాజానగరం

పరీక్షలకు 576 మంది హాజరు

రంగంపేట: మండలంలోని రంగంపేట, వడిశలేరు, సింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం పదో తరగతి పబ్లిక్ జీవ శాస్త్రం పరీక్ష జరిగినట్టు మండల విద్యాశాఖాధికారి పి.మధుసూదన రావు తెలిపారు. మూడు కేంద్రాల్లో మొత్తం 581 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 576 మంది పరీక్ష రాశారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు చెప్పారు.

సొసైటీల సమావేశాలు

కోరుకొండ: కోరుకొండ, బూరుగుపూడి, దోసకాయలపల్లి సహకార సంస్థల జనరల్ బాడీ సమావేశాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్షిక జమాఖర్చులను ఆమోదించారు. కోరుకొండ డీసీసీబీ బ్రాంచి పరిధిలోని కోరుకొండ, దోసకాయలపల్లి సొసైటీలు కంప్యూటరీకరణకు ఎంపికై నట్టు సంబంధిత సీఈవోలు తెలిపారు. ప్రత్యేక అధికారులు యు.శ్రీలక్ష్మి, ఏఆర్ శివ కుమార్, కె.సుబ్బారావు, శ్యామ్‌బాబు, డీఎల్ సుజాత, సీఈఓలు రైతులు పాల్గొన్నారు.

ఉపవాస ప్రార్థనలతో ఆధ్యాత్మిక శక్తి

కోరుకొండ/ సీతానగరం: ఉపవాస ప్రార్థనలతో ఆధ్యాత్మిక శక్తి పెరుగుతుందని తొర్రేడుకు చెందిన ఫాదర్ మణిభూషణం అన్నారు. సీతానగరం మండలం కూనవరం ఆర్‌సీఎం చర్చిలో శుక్రవారం ఉపవాస కూటాలు నిర్వహించారు. ఫాదర్ మణిభూషణం మాట్లాడుతూ ఏసుక్రీస్తు అనుభవించిన శ్రమలకు గుర్తుగా క్రైస్తవులు ఉపవాస ప్రార్థనలు చేయాలన్నారు. దీనిలో భాగంగా తొలుత శిలువను మోస్తూ ప్రదర్శన చేశారు. కోరుకొండ ఫాదర్ మాణిక్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, కె.జ్ఞానేష్, బెల్లపు డేవిడ్ పాల్గొన్నారు.

ప్రజలకు అండగా వైఎస్సార్ సీపీ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- కూటమి పాలనలో తీవ్ర అన్యాయం
- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: ప్రభుత్వ పరంగా, కూటమి నాయకుల పరంగా ఇబ్బంది పడుతున్న ప్రజలకు అండగా నిలిచి, వారికి మేమున్నామనే ధైర్యాన్నందించడంలో ప్రతి ఒక్కరూ సుశిక్షితులైన సైనికుల్లా వ్యవహరించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. 'నా కార్యకర్తలు – నా కుటుంబం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని తోకాడ, కానవరం గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి, స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఎన్నికల సమయంలో ఆచరణకు సాధ్యం కాని హామీలను గుప్పించి, మాయ చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ఏడాది కావొస్తున్నా ప్రజలకు చేసిన మేలేమీ లేదన్నారు. ఇచ్చిన హామీలను ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాలను అటకెక్కించారని విమర్శించారు. పాలకుల నిర్లక్ష్యాన్ని, నాయకుల చేతకాని తనాన్ని ప్రజలకు అర్థమయ్యేరీతిలో వివరించి, వారిలో మరింత చైతన్యాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఆయా గ్రామాలలో జరుగుతున్న పాలన, తదితర విషయాలపై స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమీక్షించారు. మండల కన్వీనర్ దూలం పెద్ద అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, కో కన్వీనర్ గండి నానిబాబు, సీనియర్ నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు అడబాల చినబాబు, బీసీ సెల్ అధ్యక్షుడు కొండపల్లి దుర్గారావు పాల్గొన్నారు.

రంజాన్ వెలుగులు

- విద్యుద్దీపాలతో మెరిసిపోతున్న మసీదులు
- భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు



వంగలపూడిలో నూర్ ముబారక్ మసీదు

సీతానగరం: రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకోవడానికి ముస్లింలు సిద్ధమవుతున్నారు. దాదాపు నెల రోజులుగా జరుగుతున్న ఉపవాస దీక్షలు ఆదివారంతో సంపూర్ణం కానున్నాయి. పండగ సందర్భంగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ముస్లిం కుటుంబాలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహిస్తున్నాయి. మసీదుల్లో జరుగుతున్న ఇఫ్తార్ విందులలో కులమతాలకు అతీతంగా అందరూ హాజరవుతున్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ప్రార్థనల్లో పాల్గొంటున్నారు. రంజాన్ సందర్భంగా మసీదులను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. రాత్రి వేళవెలుగులతో ఆ ప్రాంతంలో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. నియోజకవర్గంలో సుమారు 30 వేలు మంది ముస్లింలు ఉన్నారు. ముఖ్యంగా వంగలపూడి, సీతానగరం, రఘుదేవపురం, ముగ్గళ్ల, ఇనుగంటివారిపేట తదితర గ్రామాల్లో మసీదులు రంజాన్‌కు ముస్తాబయ్యాయి.



మత గురువు బోధనలు వింటున్న ముస్లింలు

ఐదు పూటలా నమాజు



ప్రతి ముస్లిం ఈ నెల రోజులూ ఐదు పూటలా నమాజు చేయాలి. నిత్యం అల్లాను స్మరిస్తూ ఉండాలి. నిరంతరం దైవ సాన్నిధ్యంలో గడపడమే ఈ మాసం ముఖ్య ఉద్దేశం. సత్ప్రవర్తన, దాతృత్వం వంటి సుగుణాలు జయటపట్టేదే రంజాన్ మాసం. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు రోజుకు సుమారు 16 గంటల పాటు అన్నపానీయాలు తీసుకోకుండా ఉపవాసం సాగుతుంది. ప్రతి ముస్లిం దీన్ని పవిత్ర కార్యంగా భావిస్తాడు.

– మహ్మద్ అక్బర్, నూర్ ముబారక్ మసీదు గురువు, వంగలపూడి

వైభవంగా నూకాలమ్మ జాతర



తాటిచెట్టును ఊరేగిస్తున్న భక్తులు

రాజానగరం: గ్రామదేవత నూకాలమ్మ జాతర శుక్రవారం వైభవంగా జరిగింది. గరగ నృత్యాలతో పాటు వివిధ దేవతా మూర్తులు, శక్తి వేషాలతో కళాకారుల ప్రదర్శనలు అందరినీ అలరించాయి. తొలుత మధ్యాహ్నం గ్రామంలో తాటిచెట్టును ఊరేగించారు. నూకాలమ్మ ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు గ్రామంలో అన్ని వీధుల్లోనూ సాగింది. పలువురు మహిళలు బిందెలతో నీటిని ఆ తాటిచెట్టుపై పోస్తూ భక్తితో నమస్కరించారు. అనంతరం అదే తాటిచెట్టుతో ఊయల వేసి, అమ్మవారికి ఊయల సేవ చేశారు. శనివారం ఉదయం తీర్థం జరగనుంది.

నేటి నుంచి నూకాలమ్మ తీర్థం

రంగంపేట: వడిశలేరు గ్రామ దేవత నూకాలమ్మ వార్షిక మహోత్సవం శని, ఆదివారాల్లో నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. భక్తులు, గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించి, అమ్మవారి ఆశీస్సులు పొందాలన్నారు.

ఘనంగా కాండ్రేగుల నూకాలమ్మ తీర్థం

- భారీగా తరలివచ్చిన భక్తులు
- అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి



కాండ్రేగులలో నూకాలమ్మను దర్శించుకుంటున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, పార్టీ నాయకులు

పెదపూడి: కాండ్రేగుల గ్రామంలో నూకాలమ్మ తీర్థమహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన నాలుగు ప్రత్యేక క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. స్థానికులు చలివేంద్రాలను ఏర్పాటు చేసి భక్తులకు మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు సరఫరా చేశారు. తీర్థం సందర్భంగా ఎస్సై కె.రామారావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసి, పర్యవేక్షించామని ఆలయ కమిటీ ప్రతినిధులు, ఈఓ వి.శివబాబు తెలిపారు. ఉత్సవ కమిటీ, గ్రామ యూత్ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

గ్రామాల్లో దేవతల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అందరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. కాండ్రేగుల గ్రామంలో నూకాలమ్మను సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలు సుభిక్షంగా ఉండటానికి గ్రామ దేవతల ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ, ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు సొంబత్తుల చంటి, గంగ్రేడు సర్పంచ్ కుడిపూడి మాధవీలత, కట్టా విజయరాజు, పేపకాయల ఉమా మహేశ్వరరావు, తాళ్లూరు శ్రీను, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కొప్పవరంలో ముత్యాలమ్మ తీర్థం

అనపర్తి మండలం కొప్పవరం గ్రామంలో ముత్యాలమ్మ తీర్థ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాడి సూరారెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ మల్లిడి వీర్రాఘవరెడ్డి, కర్రి సత్రెడ్డి, అనపర్తి మండల సోషల్ మీడియా కన్వీనర్ గొలుగూరి దుర్గారెడ్డి, సత్తి ప్రదీప్ రెడ్డి, మల్లిడి సత్తిరెడ్డి, కర్రి బులిమోహన్ రెడ్డి, కర్రి వెంకటరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



ప్రోత్సాహక బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

రంగంపేట: రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు రాజమహేంద్రవరం మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ సంస్థ ప్రోత్సాహక బహుమతులు ప్రకటించింది. దీనిలో భాగంగా చదువులో ప్రతిభ చూపిన 11 మంది పేద విద్యార్థులకు శుక్రవారం రాజమహేంద్రవరంలో జరిగిన కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున చెక్కులను అందించారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్య ఆర్‌జేడీ ఐ.శారద, డీవీఈఓ సుబ్రహ్మణ్యం, ఆర్ఐఓ నరసింహం, మలబార్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆ విద్యార్థులను ప్రిన్సిపాల్ బి.హేమ, అధ్యాపకులు అభినందించారు.

విమానాశ్రయం రోడ్డు విస్తరణకు చర్యలు



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని క్వారీ మార్కెట్ నుంచి విమానాశ్రయం వరకూ రోడ్డులో ఆక్రమణలను తొలగించి, విస్తరణకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విమానాశ్రయం రోడ్డును తనిఖీ చేశారు. కోలమూరు, కొంతమూరు గ్రామాలలో డ్రైనేజీలపై ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీలతో పారిశుద్ధ్యంపై సమీక్షించారు. ఆవులను రోడ్డు మీదకు వదిలితే యజమానులకు జరిమానా విధించాలన్నారు.

వినియోగదారుడికి నష్టపరిహారం అందజేత



నష్టపరిహారం అందుకుంటున్న సురేష్ కుమార్

రాజమహేంద్రవరం రూరల్: సెల్‌ఫోన్ కంపెనీ సర్వీస్ సెంటర్ సక్రమంగా స్పందించకపోవడంతో బొమ్మూరుకు చెందిన పోగుల సురేష్ కుమార్ వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కారణంగా స్క్రీన్‌పై నిలువుచారలు వచ్చాయి. దీనిని గురించి వీవో సెల్ కంపెనీ సర్వీస్ సెంటర్‌ను సంప్రదించగా వారు రూ.10 వేలు అవుతుందని చెప్పారు. దీంతో అడ్వకేట్ చిన్నం కల్పనరెడ్డి ద్వారా బాధితుడు కోర్టును ఆశ్రయించారు. హర్యానాలోని గురుగ్రామ్‌లో ఉన్న వీవో సెల్ కంపెనీకి, రాజమహేంద్రవరంలోని సర్వీస్ కంపెనీకి నోటీసులు ఇచ్చారు. రిపేర్‌తో పాటు నష్టపరిహారం చెల్లించాలని వినియోగదారుల ఫోరం అధ్యక్షులు జీవీఎస్‌వీ ప్రసాద్ తీర్పు చెప్పారు. దీంతో శుక్రవారం పోగుల సురేష్‌కు నష్టపరిహారం అందజేశారు.

టెలిమెడిసిన్ సిబ్బందికి నోటీసులు

కలెక్టర్ ఆదేశం

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో వైద్య సిబ్బంది ధోరణిపై సాక్షి దినపత్రిక శుక్రవారం ప్రచురించిన ఆ కుర్చీ మాదే...ఈ కాళ్లు మావే అనే కథనానికి కలెక్టర్ ప్రశాంతి స్పందించారు. ఆ వైద్య సిబ్బందిపై చర్యలకు ఆదేశించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులు కిటకిటలాడే పనివేళల్లో కొంతమంది వైద్య సిబ్బంది విధులు నిర్వర్తించకుండా, సెల్‌ఫోన్లు చూసుకుంటూ, కబుర్లు ఆడుకుంటున్నారు. ఆ విధంగా ఉన్న టెలిమెడిసిన్ వైద్యులపై సాక్షి పత్రికలో కథనం ప్రచురితమైంది. దీన్ని చూసిన జిల్లా కలెక్టర్ వెంటనే డిప్యూటీ కలెక్టర్, ఆసుపత్రి ఓఎస్‌డీ భాస్కరరెడ్డిని వెంటనే ఆసుపత్రికి వెళ్లి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంటనే ఆసుపత్రికి చేరుకుని టెలిమెడిసిన్ వైద్య సేవలు అందించే వైద్య సిబ్బందిని పిలిచి జరిగిన దానిపై ఆరా తీశారు. డ్యూటీలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారంటూ ఆగ్రహించారు. వారితో జరిగిన దానిపై లిఖిత పూర్వకంగా లెటర్ రాయించారు. అలాగే దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ కలెక్టర్‌కు లెటర్ ఇచ్చారు.

దళిత క్రైస్తవ నాయకుల కొవ్వొత్తుల ప్రదర్శన

రాజమహేంద్రవరం సిటీ: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని ఎస్సీ నాయకుడు జంగం సుబ్బారావు డిమాండ్ చేశారు. ప్రవీణ్ పగడాల మృతికి నిరసనగా శుక్రవారం గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కోరుకొండ చిరంజీవి మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ వంటి గొప్ప మేధావి, మంచి దైవసేవకుడి మృతి బాధాకరమన్నారు. పాస్టర్ పి.ఎర్నెస్ట్ మోజెస్, జువ్వల రాంబాబు, తాళ్లూరి బాబూ రాజేంద్ర ప్రసాద్, దారా ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.